ప్రజాశక్తి
ఆదివారం 14 సెప్టెంబర్ 2025
5
పార్వతీపురం మన్యం

కలెక్టర్‌ను కలిసిన ఎస్‌పి

పార్వతీపురం టౌన్ : మన్యం జిల్లా కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎన్.ప్రభాకరరెడ్డిని జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనతో పాటు ఎఎస్‌పి అంకిత సురానా, పాలకొండ డిఎస్‌పి రాంబాబు కూడా కలిసి అభినందనలు తెలిపారు. అలాగే జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ జి.నాగభూషణరావు ఇతర వైద్యశాఖ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు.

కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న ఎస్‌పి

సమరశీల పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

- ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి
- సిఐటియు జిల్లా మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు
- ఎరుపెక్కిన పాలకొండ

బహిరంగసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్రప్రధాన కార్యదర్శి నర్సింగరావు

పాలకొండ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, వివిధ రంగాల కార్మికులు, స్కీం వర్కర్లు,

ప్రజాశక్తి - పార్వతీపురం

సమరశీల పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. సిఐటియు 11వ జిల్లా మహాసభలు శనివారం పాలకొండ పట్టణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపాన విజికె మూర్తి ప్రాంగణంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో నర్సింగరావు మాట్లాడారు. పోరాటాలతో ఎలాంటి సమస్యలైనా పరిష్కారమవుతాయన్నారు. రూ.300 వేతనంతో ప్రారంభమైన అంగన్వాడీ కార్యకర్తలు ఈరోజు రూ.11వేలు తీసుకుంటున్నారంటే పోరాట ఫలితమేనని చెప్పారు. ఆశా కార్యకర్తలు రూ.10వేలు వేతనం, గ్రాట్యుటీ, మెటర్నిటీ లీవ్ వంటి సౌకర్యాలను పోరాటాలతోనే సాధించుకున్నారని చెప్పారు. మధ్యాహ్న భోజన కార్మికులు కూడా అదే బాటలో పోరాడి సమస్యల్ని పరిష్కరించుకుంటున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా మారుమూల ప్రాంతాల్లో అంగన్వాడీ కేంద్రాల్లో నిరుపేద పిల్లలకు, తల్లులకు అందుతున్న సౌకర్యాల పట్ల కేంద్ర ప్రభుత్వం సంతృప్తికరంగా వుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం వల్లే పేద పిల్లలు చదువుకుంటున్నారని చెప్పారు. సిఐటియు లేకపోతే కేంద్ర ప్రభుత్వం ఈపాటికే ఐసిడిఎస్‌ను ప్రయివేటీకరించేదన్నారు. 75లక్షల మంది సభ్యులు వున్న సిఐటియు దేశంలో అతిపెద్ద కార్మిక సంఘంగా గుర్తింపు పొందిందని చెప్పారు. 42 రోజుల పాటు సమ్మె చేసినా స్పందించని వైసిపి ప్రభుత్వాన్ని అంగన్వాడీ కార్యకర్తలు గద్దె దింపారని చెప్పారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభించే ఏ ప్రభుత్వానికైనా అదే విధంగా కార్మికులు బుద్ధి చెబుతారని అన్నారు. శ్రమజీవుల కష్టాలను గుర్తించని ప్రభుత్వాలు మట్టిలో కలిసిపోతాయన్నారు. గత ప్రభుత్వం హయాంలో విద్యుత్ ఛార్జీలు పెరిగాయని గొంతు చించుకున్న సిఎం చంద్రబాబు నాయుడు ఇంతవరకు 11 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని తెలిపారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రతిపక్ష నేతగా లోకేష్ తీవ్రంగా వ్యతిరేకించారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లను ఇంటింటికీ బిగిస్తున్నారని చెప్పారు. సోషలిస్టు దేశాల్లో ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యం అందుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలు చేయడం హర్షణీయమని, ఆటో కార్మికుల పొట్ట కొట్టకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును ప్రయివేటు పరం చేసేందుకు మోడీ, చంద్రబాబు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. విశాఖలో ఎకరా భూమిని కారుచౌకగా కట్టబెట్టిన టిడిపి ప్రభుత్వం మోడీ దారిలోనే కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని చెప్పారు. 40ఏళ్ళుగా ప్రభుత్వ రంగంలో ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారానికి బొగ్గు గనులు కేటాయించకుండా మోడీ ప్రభుత్వం జిందాల్ కంపెనీకి ధారాదత్తం చేసిందన్నారు. ఉక్కు పరిశ్రమపై ఉత్తరాంధ్ర జిల్లాల కు చెందిన లక్షలాది మంది ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. అలాంటి కంపెనీని ప్రయివేటు పరం చేసే విధానాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే తీవ్ర పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. డిసెంబర్ 1నుంచి 4 వరకు విశాఖలో సిఐటియు జాతీయ మహా సభలు నిర్వహిస్తున్నామని,ఈ సభల్లో మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాటానికి ప్రణాళిక రూపొందించనున్నట్లు నర్సింగరావు చెప్పారు.

జిల్లా అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

జిల్లా ఏర్పాటైన తర్వాత అభివృద్ధి కుంటు పడిందని, టిడిపి కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.రమణావు, వై.మన్మధరావు అన్నారు. జిల్లాలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు, దినసరి ఉద్యోగులపై వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, విఒఎలు, కెజిబివి, మోడల్ పాఠశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు చేశారని తెలిపారు. ఈ ఉద్యోగాలను కూటమి ఎమ్మెల్యేలు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కొత్త ఉద్యోగాలు తీసుకు రాకుండా వున్న ఉద్యోగులపై వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గంగునాయుడు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. పది వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే జిల్లాలోని ప్రతి సెంటు భూమికి సాగునీరు అందించే అవకాశం ఉందని చెప్పారు. తోటపల్లి ఎడమ కాలువ, జంఝావతి ప్రాజెక్టు, జంపరకోట రిజర్వాయర్లను నిర్మిస్తే సస్యశ్యామలమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో సిఐటియు శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి తేజేశ్వరరావు, జిల్లా నాయకులు బివి రమణ, గొర్లి వెంకటరమణ, జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున అంగన్‌వాడీ, ఆశా, సిహెచ్ డబ్ల్యుఒ, వివిధ రంగాల స్కీం వర్కర్లు పాల్గొన్నారు.

బహిరంగ సభలో పాల్గొన్న కార్మికులు, స్కీం వర్కర్లు

ఎరుపెక్కిన పాలకొండ ... కదం తొక్కిన కార్మికులు

సిఐటియు జిల్లా మహా సభల సందర్భంగా శనివారం పాలకొండ పట్టణం ఎరుపెక్కింది. ఎర్ర జెండాలతో రెపరెపలాడింది. కోట దుర్గ జంక్షన్ నుంచి కార్మికులు సభా స్థలి వరకు ర్యాలీ నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, రాష్ట్ర నాయకులు సుబ్బరావమ్మతో పాటు జిల్లా నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. ప్రజా నాట్యమండలి జిల్లా కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యాన కళాకారులు ఉద్యమ పాటలతో ఉర్రూతలూగించారు.

బిజెపికి వంత పాడుతున్న అధికార, ప్రతిపక్ష పార్టీలు

ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ

ఎన్నో పోరాటాలతో సాధించుకున్న 19 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ పార్లమెంటులో బిల్లు పెట్టినప్పుడు ఎపికి చెందిన అధికార, ప్రతిపక్షాలు వంతపాడాయని ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ చెప్పారు. ఎన్నో ఆశలతో ఓట్లు వేసి గెలిపించిన టిడిపి, జనసేనలు రాష్ట్ర ప్రజలను మోసం చేశాయని ఆరోపించారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మొండిచేయి చూపించాయన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి టిడిపి ప్రభుత్వం ఉత్సాహంగా వుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలకు సూపర్ హిట్ అని సిఎం చంద్రబాబు నాయుడు గొప్పలు చెప్పుకుంటున్నారని, మహిళా కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్నారని చెప్పారు .ఆటో, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 12 గంటల పని విధానాన్ని అమలు చేయడానికి టిడిపి ప్రభుత్వం ఉవ్విళ్లూరుతున్నదని చెప్పారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కావాలని కోరారు.

అమరుల స్థూపం వద్ద నివాళ్లు అర్పిస్తున్న సిఐటియు నాయకులు

ఉత్సాహ వాతావరణంలో ప్రతినిధుల సభ

అనంతరం కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్, (గాయత్రి కళ్యాణ మండపం) విఎస్ అచ్యుతానందన్ వేదికగా ప్రతినిధుల సభ నిర్వహించారు. ముందుగా సిఐటియు జెండాను నాయకులు ఆవిష్కరించారు. అనంతరం అమరవీల స్థూపాలకు, చిత్రపటానికి పూలమాల వేస్తూ మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. దావాలా రమణారావు, గొర్లి వెంకటరమణ, వి.ఇందిరా అధ్యక్ష వర్గంగా ప్రారంభమైన ప్రతినిధుల సభలో ప్రారంభ ఉపన్యాసకులుగా సిఐటియూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తేజేశ్వరరావు మాట్లాడారు.కార్మికులను అణిచివేసే శక్తి సృష్టిలో పుట్టనేలేదని, కార్మికుల ఐక్యత బలమైన శక్తి అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసేందుకు అనేక కుతంత్రాలు పన్నుతున్నాయని, వీటిని కార్మిక వర్గం ముక్తకంఠంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యలకు మూల కారణం పాలకుల విధానాలు, ఆర్థిక స్థితిగతులేనని దాన్ని ఐక్యంగా ప్రతిఘటించాలని కోరారు. గత మూడేళ్ల కాలంలో సిఐటియు జిల్లా కమిటీ చేసిన అనేక పోరాట అనుభవాలను నెమరు వేసుకొని నేటి మతోన్మాద, కార్పొరేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా కార్మికుల హక్కుల సాధనకై ఈ వేదిక దిక్సూచిగా నిలవాలని అన్నారు. అనంతరం అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కార్మిక, ప్రజా ఉద్యమాలపై నిర్బంధాలకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తేజేశ్వరరావు

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి

జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఒక రంగంలోనే కాకుండా అన్ని రంగాల్లో ప్రగతి సాధించేలా జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. తనపై నమ్మకంతో ఈ జిల్లాకు కలెక్టర్‌గా బాధ్యతలను అప్పగించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఉదయం చేరుకొని జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలను శనివారం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన్యం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రజలతో మమేకమై సమస్యలపై అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. వెనుకబడిన ప్రాంతమైన మన్యం జిల్లాలో గిరిజన సంక్షేమాభివృద్ధికి, విద్యా, వైద్య రంగాల బలోపేతం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పాలనపై త్వరగా పట్టుసాధిస్తానని, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి జిల్లా సమగ్రాభివృద్ధికి తోడ్పాటునందిస్తానని స్పష్టం చేశారు. అలాగే జిల్లా అభివృద్ధిలో అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా ప్రతినిధులు తమవంతు సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలుసుకొని దుస్సాలువతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో జెసి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, ఎఎస్‌పి అంకిత సురాన, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు డా.ఆర్.వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాథ్, డిఆర్‌ఒ కె.హేమలత, డిప్యూటీ కలెక్టర్లు పి.ధర్మచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, డిఎంహెచ్‌ఒ ఎస్.భాస్కర రావు, డి.ఆర్.డి.ఎ, డ్వామా, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్లు ఎం.సుధారాణి, కె.రామచంద్ర రావు, టి.కనకదుర్గ, జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారి వై.నాగేశ్వరరావు, డిఇఒ బి.రాజ్ కుమార్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.బాలమన్ సింగ్, కలెక్టరేట్, రెవెన్యూ సిబ్బంది తదితరులు కలెక్టర్ కు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సూపర్ విజన్‌తో జిల్లాను ప్రగతిపథంలోకి తీసుకువెళ్దాం : కలెక్టర్

బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

కలెక్టరుగా బాధ్యతలను స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. జిల్లా అధికారులంతా సమన్వయంతో పని చేసి జిల్లాభివృద్ధికి దోహదపడాలని అధికారులను ఆదేశించారు. మీ అనుభవాలు జిల్లా అభివృద్ధికి తోడ్పడేలా ఉండాలని, మీ సూపర్ విజన్‌తో జిల్లాను ప్రగతిపథంలోకి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రతి అధికారి బాధ్యతగా విధులు నిర్వహిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. లక్ష్యాల సాధనలో సమస్యలుంటే వాటిని తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖకు చెందిన లక్ష్యాలు, ప్రగతి, రానున్న రెండేళ్లలో సాధించబోయే ప్రణాళిక విజన్‌ను పారదర్శకంగా రచించాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన లబ్దిదారులకు అందించేలా అన్ని శాఖలు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. అంతకుముందు గతేడాదికి, ఈ ఏడాదికి గల పురోగతిపై ఆరా తీసిన ఆయన జిల్లాలో వృద్ధి సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రగతి పవర్ పాయింట్ ప్రజెంటేషను ద్వారా వివిధ శాఖలు సాధించిన పురోగతిని అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

విజ్ఞాన సంబరం... ఆరంభం

- ఘనంగా జెవివి రాష్ట్ర మహాసభలు
- సందడిగా గురజాడ అప్పారావు ప్రాంగణం
- ఉత్తేజ పర్చిన మేధావుల ప్రసంగాలు

మహాసభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగేశ్వర్

ప్రజాశక్తి - విజయనగరంటౌన్,

ముందుగా మహాసభల ప్రారంభ సూచికగా జాతీయ జెండాను ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు, జెవివి జెండాను ఆ సంఘం సీనియర్ నాయకులు నారు సింహాద్రి నాయుడు ఆవిష్కరించారు. అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమరవీరుల చిత్రపటాల వద్ద మాజీ ఎమ్మెల్సీలు, జన విజ్ఞాన వేదిక నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం జయంతి నార్లేకర్ వేదికపై జరిగిన ప్రతినిధులు సభ జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన జరిగింది. ముందుగా అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ ఆయన మాట్లాడుతూ కవులు, కళాకారులు, విజ్ఞాన బాండాగారంగా ఉన్న విద్యల నగరమైన విజయనగరంలో రాష్ట్ర మహాసభలు ఆనందంగా ఉందన్నారు. గురజాడ లాంటి దేశభక్తులు నడయాడిన నేల మీద మహాసభల జరగడం స్ఫూర్తి దాయకమన్నారు. అనంతరం ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డివి రమణ మాట్లాడుతూ వాడుక భాష ఉద్యమానికి నాంది పలికిన గిడుగు ఇక్కడ వారే, సంగీత ద్వారాలను తెరిచిన ద్వారం వెంకటస్వామి, కోడి రామమూర్తి, శ్రీరంగం నారాయణ బాబు, అంట్యాకుల. పైడిరాజు వంటి వారు పుట్టిన నేల అఅన్నారు. ప్రగతి శీల భావాలు కలిగిన ఈ ప్రాంతం ఉత్తరాంధ్ర కాదు ఉత్తమాంధ్ర అంటూ కొనియాడారు. నేటి సమాజంలో జెవివి అవసరం ఎంతో ఉందన్నారు. మెరుగైన సమాజం కోసం శాస్త్రీయ దక్పథం పెంచడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. • మహాసభలో ప్రధాన వక్త మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ ఓవైపు శాస్త్ర విజ్ఞాన ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ, అదే స్థాయిలో మూఢ నమ్మకాలు, విశ్వాసాలు పెరిగి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల కోసం, శాంతికోసం, దేశ స్వావలంభన కోసం సైన్స్ అనే నినాదంతో జన విజ్ఞాన వేదిక శక్తివంతంగా పనిచేయడం అభినందనీయమన్నారు. ఆరోగ్యం, పర్యావరణ పరి రక్షణ, శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం, మూఢ నమ్మకాలతో నష్టపోయే ప్రజలకు అండగా నిలబడాల్సిన అవసరం జెవివిపై ఉందన్నారు. • ముఖ్యఅతిథి ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ జనరల్ సెక్రెటరీ ఆషామిశా మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ సమయంలోనే ప్రజాసైన్స్ ఉద్యమానికి బీజాలు పడ్డాయని, మేఘనాథ్ సాహా, బిసి రాయ్ వంటి శాస్త్రవేత్తలు సైన్స్ సామాన్య ప్రజలకు ఉపయోగపడేలా కృషి చేశారని వివరించారు. • విద్యావేత్త, మాజీ ఎమ్మెల్యే కెఎస్ లక్ష్మణరావు రాష్ట్ర సమగ్రాభివృద్ధి అనే అంశంపై ప్రసంగించారు.

ఆధునిక సమాజం కోసం కృషి చేయాలి

మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ 19వ శతాబ్దంలో గురజాడ చెప్పిన ఆధునికత ఏ విధంగా ఉందో దాని కోసం పని చేయాల్సిన కర్తవ్యం ఏమిటో మహాసభలో నిర్ణయాల చేయాలన్నారు. గురజాడ ఉంటే గౌరీలంకేష్ ఘటన జరిగే అవకాశం ఉండేది కాదేమో అన్నారు. ఆధునిక సమాజం గురించి ప్రజలకు చెప్పాల్సి అవసరం మనపై ఉందన్నారు. ఎందుకని భారత్‌లో పారిశ్రామిక విప్లవం రాలేదో, ఎందుకు వెనుకబడి పోయింధో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలో పేరుగాంచిన టాప్ 100 యూనివర్సిటీలో ఒక్కటి కూడా దేశంలో లేదన్నారు. జెవివి గురజాడ అప్పారావు సాక్షిగా మెరుగైన సమాజం కోసం పని చేస్తుందన్నారు. ఆధునిక దేశంగా మారాలంటే, సమానత్వం, అభివృద్ధి జరగాలంటే ఆధునిక సమాజం కావాలన్న గురజాడ సాక్షిగా మరో 40 ఏళ్లపాటు ఆధునిక సమాజం కోసం కషి చేసేలా మహాసభల్లో చర్చ జరగాలన్నారు. •ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ దేశం నాలెడ్జ్ హబ్‌గా ఉందని, అక్షరాస్యత ఎంతో పెరిగిందని, అయినా ఎందుకు వెనుకబాటులో ఉన్నామో అనేది ప్రజలను చైతన్యం చేయాల్సి ఉందన్నారు. దేశంలో యువతను సక్రమంగా వినియోగించుకుంటే దేశాభివద్ధి సాధ్యం అన్నారు. రాజ్యాంగం మానవత విలువలు, సైంటిఫిక్ టెంపర్మెంట్ ఉండాలని చెప్పిందన్నారు. అదే మార్గంలో జెవివి నడుస్తుందని అభినందించారు. అక్షరాస్యత పెరగాలని, అదే సమయంలో ఆర్థిక సమానత్వం ఉండాలని అన్నారు. మన సమాజానికి జెవివి లాంటి సంస్థలు అవసరం ఎంతయినా ఉందన్నారు. అందరిలోనూ ప్రశ్నించే గుణం పెరగాలన్నారు. ఆరోగ్య కరమైన సమాజం కోసం జెవివి మరింత కృషి చేయాలని కోరారు. • మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ అజ్ఞానంలో ఉన్న ప్రజలను జ్ఞానం వైపు నడిపించడానికి జెవివి ఎంతో కృషి చేస్తోందన్నారు.

సైన్స్ ఉద్యమానికి ఎల్లలు అవసరం లేదు

సైన్సు ఉద్యమానికి ఎల్లలు అవసరం లేదని జెవివి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రాజేశ్వరరావు అన్నారు. దేశంలో శాస్త్రీయతను పెంపొందించే సైన్సునుప్రచారం చేప 40పైగా సంస్థలు ఉన్నాయని అందులో జనవిజ్ఞాని వేదిక ఒకటని. అందులో ఆంధ్రప్రదేశ్ ముందువరుసలో ఉంటుందని అన్నారు. సోషల్ మీడియాలో జన విజ్ఞానంపై అనేక దాడులు జరుగుతున్నాయని వాటిని మనం తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. 12 లక్షల మంది విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక శతభిక టాలెంట్ పేరుతో దగ్గరయ్యిందన్నారు.

గురజాడ గృహాన్ని పరిరక్షించుకోవాలి

గురజాడ వారసురాలు ఇందిర మాట్లాడుతూ గురజాడ గృహాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 1980లో గురజాడ గృహాన్ని కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి అందించారని, 2015లో పురావస్తు శాఖ ఆధీనంలోకి తీసుకుందని తెలిపారు. 150 ఏళ్ల చరిత్ర కలిగిన గురజాడ సాహిత్యాన్ని కాపాడుకోవాలన్నారు. శాస్త్ర సాంకేతిక అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని నమ్మిన వ్యక్తి గురజాడ అని, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన అవసరాన్ని అప్పుడే పసిగట్టారని అన్నారు. గురజాడ గృహాన్ని పరిరక్షించుకొని కొన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు. • ప్రముఖ కథారచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ సమాజాన్ని అజ్ఞానం వైపు నడపడానికి రాజకీయ నాయకులు ముందుంటారని విమర్శించారు. గాంధీ పుట్టిన నేలలో గాడ్సే నాయకులు దేశాన్ని నేడు పాలిస్తున్నారని అన్నారు. సనాతనాన్ని మోసిన వారు, మతం రాజ్యమేలేలా చేస్తున్నారని అన్నారు. అందరం కలసికట్టుగా పనిచేసి అజ్ఞానాన్ని మూఢత్వాలను తొలగించాలని పిలుపునిచ్చారు.

• విజయనగరం డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ పిల్లలనుంచి పెద్దల వరకు జెవివి విజ్ఞానాన్ని అందిస్తుందన్నారు. జనవిజ్ఞాన వేదికలో సమతా టీం మహిళల కోసం ప్రత్యేకంగా పనిచేస్తుందని కొనియాడారు. మూఢనమ్మకాలను, సైన్సును ప్రజల్లోకి తీసుకు వెళ్లడం అభినందనీయమన్నారు. • సభలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె.విజయగౌరి సావిత్రిబాయ్ పూలే మీద రాసిన పుస్తకాన్ని, జెవివి పల్నాడు జిల్లా అధ్యక్షులు రాసిన మానవుడే మహనీయుడు, కాకినాడ జెవివి నాయకులు రాసిన పుస్తకాలను ఆవిష్కరించారు. • జెవివి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎంవిఎన్ వెంకటరావు ఆహ్వానం పలికిన ఈ మహాసభలో జనసేన నాయకులు ఎం.సురేష్, జెవివి నాయకులు చీకటి దివాకర్, తదితరులు ప్రసంగించారు. జెవివి నాయకులు వి.రాజగోపాల్, రమణ ప్రభాత్, కె.శివానంద్ కుమార్, సమతా కన్వీనర్ జి.నిర్మల తదితర నాయకులు పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర అధ్యక్షులు గేయానంద్, మాజీ ఎమ్మెల్సీ విబి బాలసుబ్రమణ్యం; హాజరైన ప్రతినిధులు

ఎమ్మెల్యేకు కలిసి అనుమతులు రద్దు చేయాలని కోరుతున్న గ్రామస్తులు

క్వారీ అనుమతులు రద్దు చేయించండి

కాలుష్యం, భారీ శబ్దాల వల్ల ఇబ్బందులు పడుతున్నాం

ఎమ్మెల్యేకు హెచ్ కారాడవలస గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మండలంలోని హెచ్.కారాడవలస పక్కనే ఉన్న ఎలుగుల మెట్ట క్వారీ అనుమతులను రద్దు చేయించాలని హెచ్.కారాడవలస గ్రామస్తులు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ చంద్రతో అన్నారు. శనివారం గ్రామస్తులు ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి వినతి పత్రం అందించి తమ బాధను తెలుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మా గ్రామం పక్కనే ఉన్న ఎలుగుల మెట్టపై క్వారీ తవ్వకాలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని, క్వారీ ఏర్పాటైతే భవిష్యత్తులో జరగబోయే నష్టాన్ని, ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరించారు. క్వారీ తవ్వకాల వల్ల పంట భూములు, సమీప చెరువులు కలుషితమవుతాయని, పెద్దపెద్ద శబ్దాల వల్ల ఆరోగ్య సమస్యలు కూడా వస్తాయని, వెంటనే క్వారీ తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు నిలిపివేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ క్వారీ తవ్వకాల అనుమతుల రద్దుపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని, ప్రజల అభిప్రాయం లేకుండా ఎటువంటి తవ్వకాలు చేయకూడదని, అలా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలియజేయడంతో హెచ్.కారాడవలస గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఎపి ఆర్ఎస్ఎ కొత్త కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కలెక్టరేట్ యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షులుగా కలెక్టరేట్ డిటి కె.చంద్రమౌళి, అసోసియేట్ అధ్యక్షులుగా కలెక్టరేట్ డిటి ఎ.వి.నాగారావు, ఉపాధ్యక్షులుగా ఎం.మంజూష, కె.సుధీర్ బాబు, కె.స్వాతి, కార్యదర్శిగా వి.హెచ్.రాజేష్ ఎన్నికయ్యారు. పార్వతీపురం డివిజన్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులుగా బలిజిపేట తహశీల్దార్ ఆర్.బాలమురళీకృష్ణ, అసోసియేట్ అధ్యక్షులుగా సాలూరు సివిల్ సప్లయి డిటి పి.కిరీటి, ఉపాధ్యక్షులుగా ఎ.జగదీశ్వరరావు, పి.తిరుమలరావు, ఎస్.సునీత, కార్యదర్శిగా పి.రమేష్ నాయుడు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎంఎన్ ప్రసాద్ వ్యవహరించారు.

నడిమికెళ్ల లో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడిమికెళ్లలో శనివారం స్థానిక వైద్యాధికారి సాయికుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరపీడితులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, తదితర రోగులకు ప్రత్యేక వైద్యతనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి ఎమ్మెల్యే అభినందన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తెర్లి రవి కుమారును స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అభినందించారు. ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి అమరావతిలో సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్న విషయం తెలిసిందే. పురస్కారం అందుకున్న గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ తెర్లి రవికుమార్ శనివారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా టిడిపి కార్యాలయంలో కలవడంతో ఆయన్ను అభినందించారు.

దారపాడు జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో దోనుబాయి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న దారపాడు జంక్షన్ వద్ద శనివారం ఎస్ఐ షేక్‌మస్తాన్ వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మితిమీరిన వేగం వెళ్లరాదని, ఫోర్ వీలర్స్ పరిమితి మించి ప్రయాణికులను ఎక్కించరాదని సూచించారు. హెల్మెట్ సీ-బుక్ లైసెన్స్, ఇన్సూరెన్స్ వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలూ తప్పనిసరిగా ఉండాలన్నారు. ట్రిబుల్ రైడింగ్ చేయరాదని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. యువతకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అందులో ఉంచిన సామాగ్రిని శనివారం ఆర్ఐ పి. దిలీప్, వీఆర్ఓ పి.మహేంద్ర తన సిబ్బందితో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో ఎవరైనా ఆక్రమణలు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీఆర్ఎ జి. ఈశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

109 మంది మందు బాబులకు రూ.11 లక్షలు జరిమానా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం సేవించి బైక్ నడిపి పోలీసు కేసుల్లో పట్టుబడిన 109 మంది మందు బాబులకు శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్.దామోదరరావు ఒక్కొక్క వ్యక్తికి రూ.10 వేలు చొప్పున రూ.11లక్షలు జరిమానా విధించినట్లు పట్టణ సిఐ మురళీధర్, ఎస్ఐ గోవిందరావు తెలిపారు. మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడిపితే మొదటి సారి పోలీస్ కేసులతో పాటు, న్యాయస్థానం అపరాధ రుసుం విధిస్తుందని, రెండోసారి మళ్లీ అదే కేసులో పట్టుబడితే శిక్షతో పాటు, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని అన్నారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని మూడో వార్డు వివేకానంద కాలనీకి చెందిన మాచర్ల గణపతిరావుకు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర రూ.63,105 చెక్కును టిడిపి కార్యాలయంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఆరోగ్య సమస్యలు ఎదురైతే వైద్యం చేయించుకోలేని పరిస్థితి ఉన్న వారికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధితులకు ఆర్థిక సహాయంగా సిఎం సహాయ నిధి కింద ఎంతో మందికి అందజేస్తున్నారని అన్నారు. అనంతరం లబ్ధిదారుడు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ఎంతో ఖర్చుతో కూడిన చికిత్స చేయించుకోవడానికి ఎమ్మెల్యేను సాయం కోసం అడిగిన వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా తమకు ఆర్థిక సహాయం అందజేశారని, వారు చేసిన సహాయం ఎప్పటికీ మర్చిపోమని ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కీతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మజ్జి వెంకటేష్, కోలా మధుసూదనరావు, గుంట్రెడ్డి రవికుమార్, కౌన్సిలర్ మంత్రి రవికుమార్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు మెరువ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ బంకులో నో స్టాక్

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ఐటిడిఎ నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులో శనివారం పెట్రోల్, డీజిల్ నోస్టాక్ బోర్డు పెట్టడంతో వినియోగదారులు నిరాశతో వెనుదిరిగారు. ఐటిడిఎ నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులో నాణ్యమైన పెట్రోల్, డీజిల్ దొరుకుతుందని ఈ బంకుకు వస్తుంటారు. ప్రతి మూడు రోజులకి రెండు రోజులకి ఆయిల్ నో స్టాక్ బోర్డ్ పెట్టడంతో వినియోగదారులు పెదవి విరుస్తున్నారు. దీనిపై ఎపిఒ చినబాబు వద్ద ప్రస్తావించగా ఆయిల్ కంపెనీ వద్ద సమస్య ఉందని సమాధానం ఇచ్చారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడి పరిసరాలను, వార్డులను పరిశీలించి వైద్యాధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలను జారీ చేశారు. ఆసుపత్రి పరిసరాలు ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలోని రోగులు, బాలింతలతో మాట్లాడిన కలెక్టర్ వైద్య సేవలు, ఉచిత మందుల పంపిణీ, సమస్యలపై ఆరా తీశారు. కార్పొరేట్ స్థాయిలో ఆసుపత్రి వార్డులను తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. రోగులతో పాటు సహాయకులకు కూడా భోజనం ఏర్పాటు చేయాలని, ఇందుకు ఆసుపత్రిలోనే ఒక క్యాంటీన్ పెట్టేలా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పడకలతో పాటు అదనపు పడకలను పెంచడానికి, పెండింగులో ఉన్న పనులను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పెండింగ్ పనులు నిర్ణీత సమయానికి ముందే పూర్తిచేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యపై వివరాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్ సిజేరియన్ల సంఖ్యను తగ్గించి, సాధారణ ప్రసవాల సంఖ్య పెరగాలని సూచించారు. సిజేరియన్ రేటు ఎక్కువగా ఉన్న ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని డిసిహెచ్ఎస్,

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

డిఎంహెచ్ఒలను కలెక్టర్ ఆదేశించారు. ప్రసవాలకు ముందు, తదుపరి రక్తహీనత సమస్యలు ఉండరాదని తేల్చిచెప్పారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అందుకు తగిన విధంగా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థినులతో ముచ్చటించి వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, విద్యను అందించాలని ఆదేశించారు. ఎల్లవేళల వసతి గృహ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, రక్తహీనత లేకుండా చూడాలని అన్నారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంగా ఉండేలా పర్యవేక్షిస్తూ ఉండాలని వసతి గృహ సంక్షేమ అధికారిని ఆదేశించారు. పర్యటనలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్. భాస్కరరావు, డిసిహెచ్ఎస్ నాగభూషణరావు, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డా. ఎం. వినోద్ కుమార్, ఆసుపత్రి పర్యవేక్షకులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డైట్ కళాశాల ఏర్పాటు చేయాలి : మండంగి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం గ్రామంలో గతంలో ప్రభుత్వం ప్రతిపాదించిన విధంగా డైట్ కళాశాల ఏర్పాటు చేసి స్థానికంగా గిరిజన అభ్యర్థులకు ఉపాధ్యాయ శిక్షణ ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ శనివారం ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వాహయాంలో భద్రగిరి ఆర్ ఐటిఐ ఆవరణంలో డైట్ కళాశాల నిర్మాణానికి స్థలాన్ని కూడా పరిశీలించారని గుర్తు చేశారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.30 లక్షలు మంజూరు చేసిందని, పనులు ప్రారంభించక పోవడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయని చెప్పారు.

ఈ ప్రాంతంలో డైట్ కళాశాల లేకపోవడంతో గిరిజన అభ్యర్థులు విజయనగరం, విశాఖపట్నం వంటి దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం హయాంలోనైన గుమ్మలక్ష్మీపురంలో డైట్ కళాశాల ఏర్పాటు చేసి స్థానికంగా గిరిజన అభ్యర్థులకు ఉపాధ్యాయ శిక్షణ అందించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ నిర్ణయాలతో పేదోడి బతుకు ప్రశ్నార్థకం

ప్రజాశక్తి - కురుపాం

మాజీ డిప్యూటీసిఎం పుష్పశ్రీవాణి

కూటమి ప్రభుత్వ నిర్ణయాల వల్ల పేదవాడి బతుకు ప్రశ్నార్థకంగా తయారయ్యిందని మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. శనివారం చినమేరంగిలో గల తన అతిథి గృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు తీసుకు వచ్చి ఏడు కాలేజీలు పూర్తిచేసి వైద్య విద్యను అందించామన్నారు. కూటమి ప్రభుత్వం మంత్రివర్గ సమావేశంలో 10 కాలేజీలను ప్రైవేటుపరం చేస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నప్పటికీ, మన్యం జిల్లా కాలేజీలు కూడా రద్దు అవుతున్నా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ తన మంత్రి పదవి కోసం మన్యం జిల్లా అభివృద్ధిని తాకట్టు పెట్టిందని ఆరోపించారు. హోం మంత్రి అనిత రాష్ట్రంలో జరుగుతున్న అక్రమ గంజాయి రవాణా, మహిళల పట్ల జరుగుతున్న అరాచకాలపై దృష్టి పెట్టకుండా జగన్మోహన్ రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు.

అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్న ఇవిఎం ఎమ్మెల్యే

రైతులకు ఎరువులు కొరత లేకుండా అందిస్తున్నామని ఇవిఎం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రైతులు గురించి ఆమెకు కనీసం అవగాహన లేదన్నారు. కురుపాంలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణం చివరి దశకి చేరుకున్న భవనాన్ని తక్షణమే పూర్తి చేసి పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సదుపాయంతో పాటు

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సిఎం పుష్పశ్రీవాణి

మౌలిక వసతులు కనిపించేలా చర్యలు చేపట్టాలని కోరారు. మీ ఇంటి పక్కన ఉన్న భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి కూడా పూర్తిస్థాయి సిబ్బంది నియమించేలా చర్యలు చేపట్టి అభివృద్ధిపై దృష్టి పెట్టి నియోజకవర్గంలో ప్రజలకు కావలసినటువంటి సంక్షేమ అభివృద్ధి పథకాలపై పూర్తిస్థాయి దృష్టి పెట్టి అవగాహన పెంచుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, వైసిపి మండల నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

షెడ్లు లేక వంటకు అవస్థలు

ప్రజాశక్తి - కొమరాడ

విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మధ్యాహ్నం భోజనం పథకంలో భాగంగా వంటల వండేందుకు కనీసం నీడసదుపాయం లేకపోవడంతో నిర్వాహకులు తీవ్ర అవస్థలుపడుతున్నారు. మండలంలోని కోటిపాం జిల్లా పరిషత్ హైస్కూల్లో మధ్యాహ్నం భోజనం ఉండేందుకు షెడ్డు లేకపోవడంతో వర్షం పడుతున్న సమయంలో నిర్వాహకులకు తిప్పలు తప్పడం లేదు. ఈ పాఠశాలలో 370 మంది విద్యార్థులు వివిధ గ్రామాల నుంచి వచ్చి చదువుకుంటున్నారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకం పెడుతున్నప్పటికీ భోజనం వండేందుకు నిర్వాహకులకు తిప్పలు తప్పడం లేదు. పలు సందర్భాల్లో తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. జిల్లాలోనే అత్యధికంగా చదువుతున్న విద్యార్థుల్లో కోటిపాం జెడ్పి హైస్కూల్ మొదటి స్థానంలో ఉంది. ఇంత మంది విద్యార్థులు చదువుతున్నా ఈ పాఠశాలలో కనీసం వంటగది సౌకర్యం లేకపోవడంతో చిన్న చినుకు పడితే వంటలు వండేందుకు కష్టతరంగా మారుతుంది. మరో వైపు చెట్టు కింద వంటలు చేయడంతో చెట్టు పైనుంచి ఉన్న చెత్తాచెదారం, పిట్ట రెట్టలు వండిన వంటల్లో పడిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో నిర్వాహకులు చూడని సమయంలో చెత్తాచెదారాలు పడడంతో విద్యార్థులు ఆహారం తినేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలకు కనీసం ఒక కిచెన్ షెడ్ మంజూరు చేయాలని నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులుకోరుతున్నారు.

వంట కోసం ఏర్పాటు చేసిన టార్పాలిన్ గది ఇదే..

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని ఎం.రాజపురం పంచాయతీ పరిధిలోని గంగంపేట గిరిజన గ్రామంలో ప్రకృతి ద్వారా సాగుచేసిన పంటను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు రసాయన ఎరువులు వాడకుండా వరినాట్లు వేసి 25 రోజులు తర్వాత వేసిన పంట లైన్‌షోను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పంట ఎడబాటు ఉండటం వల్ల కలుపు మొక్కలు పెరిగే అవకాశాలు లేవన్నారు. ఈయనతోపాటు ఎపి సిఎన్ఎఫ్ మండల యాంకర్ ఎం సింహాచలం, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు జి.గౌరునాయుడు ఉన్నారు.

వరిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

లోక్ అదాలత్ ద్వారా 460 కేసులు రాజీ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జాతీయ లోక్ అదాలత్‌లో 460 కేసులను రాజీ చేసినట్టు రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఉపయోగపడుతుందన్నారు. కక్షిదారులు రాజీ చేసుకోవడం వల్ల ఖర్చులు తగ్గుతాయని, మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుందని జడ్జి అన్నారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే కన్నా కేసులను సామరస్యం పరిష్కరించుకొని రాజీ చేసుకోవడమే ఉత్తమ మార్గమని తెలిపారు. కోర్టుకు ఎటువంటి ఫీజు చెల్లించకుండా కేసులు రాజీ చేసుకోవచ్చని సూచించారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారమైతే కోర్టుకు మొదట చెల్లించిన రుసుమును కక్షిదారులకు కోర్టు తిరిగి చెల్లిస్తుం దన్నారు. సివిల్ కేసులు 23, క్రిమినల్ కేసులు 431, మోటారు యాక్సిడెంట్ 7 కేసులను ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించామని, కక్షిదారులు ప్రతి ఒక్కరూ ఇలాంటి సదావకాశాలను వినియోగించుకుని లబ్ధిపొందాలని సూచించారు. కార్యక్ర మంలో అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె.సౌమ్యా జాస్పిన్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.చంద్ర కుమార్, బార్ ప్రెసిడెంట్ ఎన్. శ్రీనివాసరావు లోక్ అదాలత్ సభ్యులు, కక్షిదారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి దామోదరరావు

కురుపాం : స్థానిక కోర్టు పరిధిలో 101 కేసులను ప్రధాన న్యాయమూర్తి జె. సౌమ్యజోస్పిన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యాయని కోర్టు సిబ్బంది ఓ ప్రకటనలో తెలిపారు. వీటిలో క్రిమినల్-29, ఎన్టీసీ-70, ఎక్సైజ్-2 కేసులు ఉన్నాయన్నారు. లోక్ అదాలత్ సభ్యులుగా న్యాయవాదులు పి.సురేష్ కుమార్, జి.రాజుకుమార్ ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమించాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమించి విద్యార్థులకు కనీస వైద్య సదుపాయాలను కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బి.అనిల్ డిమాండ్ చేశారు. మండలంలోని నీలకంఠపురం, ధర్మలక్ష్మీపురం గ్రామాల్లో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలు లేకపోవడం విద్యార్థులు అనారోగ్యాబారిన పడి మరణించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం దృష్టి సారించకపోవడం బాధాకరమని అన్నారు. ఎఎన్ఎంలను నియమిస్తామని గిరిజన సంక్షేమశాఖామంత్రి జి.సంధ్యారాణి పెట్టిన మొదట సంతకం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ధర్మలక్ష్మీపురం ఆశ్రమ పాఠశాలకు ప్రహరీ గోడలు ఏర్పాటు చేయాలన్నారు. గోడ లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకుడు అనిల్

బెల్ట్ షాపులపై ఉక్కుపాదం

సీతానగరం: బెల్ట్ షాపుల నిర్వాహకులపై ఉక్కు పాదం మోపుతున్నామని ఎక్సైజ్ సిఐ డి.పద్మావతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న 145 మందిపై కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి 226 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. మద్యాన్ని ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలని, ఎక్కడైనా గొలుసు దుకాణాలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 14405కి, 9440902373 తన నెంబర్‌కి తెలియజేయాలన్నారు.

ప్రశాంతంగా హిందీ పరీక్షలు

కురుపాం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ ప్రచారసభ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మొదటిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. విశారధ, భూషణ్, విద్వాన్ పరీక్షలకు 28 మందికి 27 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ టి.శంకరరావు, హిందీ కేంద్ర వ్యవస్థాపకులు సంతోష్ కుమార్ తెలిపారు. అనంతరం పరీక్ష కేంద్రాన్ని ఎంఇఒ ఎన్. సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ప్రజా ధనానికి తూట్లు

ప్రజాశక్తి - వీరఘట్టం

గుత్తేదారిచ్చే కాసులకు కక్కుర్తిపడి పనులు జరిగినప్పుడు పర్యవేక్షణ లేకపోవడంతో పాటు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో దీర్ఘకాలంగా ఉండాల్సిన నిర్మాణాలు పట్టుమని పదిరోజులు ఉండడం లేదు. ఇందుకు నిదర్శనం నడుకూరు-కిమ్మి మధ్య నిర్మించిన రహదారి పనులే. మండలంలోని నడుకూరు గ్రామ సీఎస్పీ రహదారి నుండి కిమ్మీ వరకు ఈ ఏడాది మార్చిలో రహదారికి మరమ్మతుల పేరిట పనులు చేపట్టారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లేకపోవడంతో ఈ రహదారి ఎక్కడికక్కడ పెచ్చులూడి దర్శనమిస్తుందని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రజా ధనాన్ని కాపాడాల్సిన అధికారులే చేతివాటం చూపడంతో మరమ్మతు పనులు కూడా కొద్ది కాలంలోనే కరిగిపోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతుకు గురైన రోడ్డు

ఎమ్మెల్యేను కలిసిన నారాయణమూర్తి

ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న నారామయణమూర్తి

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 15న తాను నటించిన సినిమాను చూడాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అలాగే నియోజకవర్గంలో పరిస్థితులపై ఆరా తీశారు. వీరితో పాటు కూటమి నాయకులు పాలవలస లీలప్రసాద్, టి రమేష్, బౌరోతు నీలకంఠమ నాయుడు,

కొండలరావును కలిసిన సినీ నటుడు నారాయణమూర్తి

పాలకొండ : స్థానిక నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావును సినీ నటుడు ఆర్ నారాయణమూర్తి శనివారం ఆయన స్వగృహంలో కలిశారు. పలు విషయాలు చర్చించాక సోమవారం విడుదలవుతున్న సినిమాను ఆదరించాలని కోరారు. దీనికి కొండలరావు కూడా స్పందిస్తూ కచ్చితంగా ఆదరిస్తామని, సమాజంలో జరుగుతున్న పరిణామాలకు అనుగుణంగా సినిమాలు తీస్తారని అన్నారు.

ఇళ్లపై కూలిన భారీ చింత చెట్టు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని నెల్లికెక్కివ పంచాయతీ జోగిపురం గ్రామంలో శనివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులు, వర్షానికి ఇళ్ల పెరటిలో ఉన్న భారీ చింత చెట్టు నాలుగు రేకు ఇళ్ళపై ఒక్కసారిగా కూలడంతో గిరిజనులు భయాందోళన చెందారు. జీలకర్ర సున్నమ్మ, పువ్వల సున్నమ్మ, జీలకర్ర రామారావు, పువ్వల కోతమ్మ ఇళ్లపై చింతచెట్టు కూలడంతో రేకులు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఎవరికి ఎటువంటి ప్రాణహానీ జరగలేదు. ఇల్లు పాడవ్వడంతో గిరిజనుల లబోదిబోమంటున్నారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

రేకులు ఇళ్లపై పడిన చెట్టు

కమిషనర్‌కు వినతినిస్తున్న కార్మికులు

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- సాలూరు రూరల్

అనేక ఏళ్లగా పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాముడు, శంకరరావు, రవి డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ టిటి రత్నకుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పటి నుండో మున్సిపల్ కార్మికులకు ఇవ్వవలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని, ఆగస్టు నెల జీతాలను ఇప్పటివరకు ఇవ్వలేదని, చనిపోయిన కార్మికులకు ఉద్యోగాలను మంజూరు చేయలేదని, వర్షాకాలం దృష్ట్యా కార్మికులకు రెయిన్ కోట్లను బూట్లను, అవసరమైన పనిముట్లు అందజేయలేదని గుర్తు చేశారు. పట్టణ జనాభా పెరిగినందున విస్తీర్ణం ప్రకారం కార్మికులను పెంచాలని, స్థానిక మంత్రి హామీ ప్రకారం కార్మికులందరికీ నూనెలు, సబ్బులను తక్షణమే అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ (జూనియర్ డివిజన్) పార్వతీపురం
O.S. No. 69/2023

Between:-
ది బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంక్, పార్వతీపురం ....వాది
And:
చిలకలపల్లి నీలమణి ....ప్రతివాది

To,
చిలకలపల్లి నీలమణి, భర్త రమేష్, వయస్సు 41 సంవత్సరములు, వివేకానంద కాలనీ, రాయగడ రోడ్, పార్వతీపురం మున్సిపాలిటీ, పార్వతీపురం మన్యం జిల్లా.

పై నెంబర్ దావాలో మీరు ప్రతివాదిగా యున్నారు. అయితే పలుమార్లు మీకు గౌరవనీయులైన కోర్టు వారి ద్వారా మీకు పలుమార్లు సమాన్లు పంపించినప్పటికీ మీరు తీరస్కరించుచున్నారు. కావున మీ యొక్క హాజరు నిమిత్తం **తే 23-09-2025 దీన ఉ॥ 10:30 గం॥ లకు** స్వయంగా గాని, వకీలు ద్వారా గాని కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయవలసినదిగా ఆజ్ఞాపించడమైనది. లేని ఎడల కోర్టువారు మీ పరోక్షమందు తీర్మాణం చేయుదురు.

//కోర్టువారి ఆర్డరు ప్రకారం//

గొర్లి వెంకటరావు
స్టాండింగ్ కౌన్సిల్ ఆఫ్ కెనరా బ్యాంక్,
పార్వతీపురం బార్ అసోసియేషన్,
ఫోన్ నెం: 9440343572.